క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అయ్యప్ప స్వామి

కోట: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఎంజీ రవి, వాసు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్టు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పట్టణంలోని పాతకోట శ్రీరామ మందిరంలో హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సంప్రదాయ దుస్తులతో కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఘనంగా చండీ యాగం



పూర్ణాహుతి చేస్తున్న వేద పండితులు

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం చండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ పౌర్ణమి సందర్భంగా చండీ యాగం నిర్వహిస్తామని ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలోనే సోమవారం ఉభయకర్త సురేంద్ర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చండీ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటుచేసి నవ కలశ స్థాపన చేశారు. అనంతరం యాగం చేశారు. ఈవో మాట్లాడుతూ నేడు మానవ సమాజంలో అశాంతి పెరిగిపోతోందన్నారు. దీన్ని నివారించేందుకు ప్రతి పౌర్ణమికీ చండీ యాగం నిర్వహించి శాంతి కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ముత్యాలమ్మ మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

కండలేరులో 8.303 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 8.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 430 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 95, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలుడి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న వేణుగోపాల స్వామి

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని మంగళంపాడు గ్రామంలో వెలసిన సౌందర్య వల్లీ రుక్మిణి సత్యభామ గోదాదేవి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వాహకుడు సెల్వం స్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. మంగళంపాడు, ఇలుపూరు, దామానెల్లూరు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథాన్ని లాగారు. సాయంత్రం ఆలయంలో జలద్రోణి స్నానాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారు అశ్వవాహనంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

పేద మహిళకు సాయం

కోట: మండలంలోని శ్యాంసుందరపురానికి చెందిన జరీనా వైద్యానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఎంపీటీసీ మొబీన్‌బాషా వెంకటగిరి సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో షరీఫ్, ఇలియాజ్, అబ్దుల్లా, అమీర్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- జగనన్న చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- నాయకులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : మనస్పర్థలు, అభిప్రాయ భేదాలను వదిలిపెట్టి కలిసికట్టుగా పనిచేసి జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. ఆయన సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో సూళ్లూరుపేట మండలం, మున్సిపాలిటీకి చెందిన నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మే 175 నియోజకవర్గాల్లో విజయాన్ని అందిస్తుందని, ఆయన చేసిన మంచిని ప్రజలకు వివరిస్తే చాలు ఓట్లు వేస్తారని తెలిపారు. మనలో మనకు ఎన్ని మనస్పర్థలున్నా జగనన్నకోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ తీసుకువచ్చి జగనన్నకు బహుమతిగా ఇద్దామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మంచి చేశామని, ఇతర పార్టీల వారి ఇంటికి వెళ్లి ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందని చెప్పారు. ముఖ్యంగా టీడీపీ, జనసేనకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. జిత్తులమారి చంద్రబాబు ఈసారి ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకునేందుకు సిగ్గూశరం విడిచిపెట్టి అన్ని పార్టీలను కలుపుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నిన్నమొన్నటి దాకా నరేంద్రమోదీని తిట్టిన మాట తిట్టకుండా తిట్టారని, ఇప్పుడు ఆయన బూట్లు నాకుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లో ఇంతటి నీచమైన వ్యక్తి వుంటారా అని నిలదీశారు. అధికారం కోసం తప్పుడు హామీలిచ్చి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటయిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని గర్వంగా చెప్పుకుని ప్రజల్లోకి వెళ్లి ఓటు అడగాలన్నారు. సూళ్లూరుపేట మండలం, మున్సిపాలిటీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సుశిక్షితులైన సైనికుల్లా పనిచేసి రెండోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అల్లూరు అనీల్ కుమార్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పోలూరు పద్మ మిల్టన్, చిన్ని సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ అయితా శ్రీధర్, మండల జేసీఎస్ అధ్యక్షుడు మందా దేవేంద్రరెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నిషా సుల్తానా, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం కావాలి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ

వెంకటగిరి రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా సమష్టిగా పనిచేయాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం వెంకటగిరి రూరల్ మండలంలోని చిన్నన్నపేట, చిన్నపరెడ్డిపల్లి, నీలకంఠాపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు పార్వతమ్మ, రామయ్య, గునపాలనాయుడు, రమణయ్య, రాజప్పనాయుడు, మణికుమార్, అక్కల విజయమ్మను పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఇటీవల వారి కుటుంబ సభ్యులు మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో తన భర్త, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, తాను అనేక అభివృద్ధి పనులు చేసినట్టు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనేక సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులు చేసినట్టు వివరించారు. వాటిని గుర్తుంచుకుని ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తన కుమారుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నాగయ్య, నాయకులు సదారెడ్డి, రాజారెడ్డి, రమణయ్యనాయుడు, సర్పంచ్ బత్తయ్య, మాజీ సర్పంచ్ సాయిరామ్‌నాయుడు, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



డక్కిలి: జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ చౌడయ్య



రాపూరు: వాహనాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం, పోలీసులు

డక్కిలి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు డక్కిలిలో వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. ఎస్ఐ చౌడయ్య తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని డక్కిలి, లింగసముద్రం, మాధవయ్యపాళెం తదితర చోట్ల వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మత్తు పదార్థాలు, మద్యం, నగదు దొరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి సమయాల్లో జాతీయ రహదారిపై ప్రతి రోజూ తనిఖీ నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా వస్తువులు, నగదు తరలించరాదని పేర్కొన్నారు.



సైదాపురం: తనిఖీ చేస్తున్న అధికారులు

రాపూరులో..

రాపూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద సోమవారం తహసీల్దార్ వెంకటరత్నం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మద్దెలమడుగు, పంగిలి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వాహనాల్లో అధిక మొత్తంలో నగదు తీసుకెళితే తగిన ఆధారాలు చూపాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సునంద, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం సైదాపురంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏవైనా వస్తువులను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ క్రమంలో ఆధారాలు చూపని కొంత నగదును స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించారు.

ఇరకం పోలింగ్ కేంద్రంలో వసతుల పరిశీలన

తడ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా తడ తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ సోమవారం ఇరకం గ్రామంలోని 291, 292 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లు, ఓటింగ్ సిబ్బందికి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచించారు. కేంద్రంలో వసతులను ఆరా తీశారు. పడవ ప్రయాణం ద్వారా మాత్రమే గ్రామానికి చేరుకునే వీలు ఉన్నందున ఎన్నికల సమయానికి సిబ్బంది చేరుకునేందుకు, ఎన్నికలు ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు భద్రంగా స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకురావడంపై సిబ్బందితో చర్చించారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి



తడ: బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్

తడ: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ మధుకర్‌రావు సోమవారం బీవీపాళెం సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా పై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట గూడూరు ఎస్ఈబీ సూపరింటెండెంట్ జే రమేష్, సీఐ రమేష్ ఉన్నారు.

డక్కిలిలో మహిళా ఓటర్లే అధికం

డక్కిలి : మండలంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని అధికారులు తెలిపారు. మండలంలో 32,370 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వారిలో మహిళలు 16,433 మంది, పురుషులు 15,936 మంది ఉన్నట్టు వెల్లడించారు. ఎన్నికల్లో మహిళలు కీలకం కావడంతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ నాయకులు తిప్పలు పడుతున్నారు.

పేదల పక్షపాతి సీఎం జగనన్న



ఇంటింటా ప్రచారం చేస్తున్న మేరిగ మురళీధర్ తనయులు

గూడూరు రూరల్ : పేదల పక్షపాతి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తనయులు డాక్టర్ రేవంత చక్రవర్తి, హేమంత్ కళ్యాణ్ కోరారు. వారు సోమవారం నాయకులతో కలిసి గూడూరు పట్టణంలోని 4వ వార్డు దూర్జటినగర్, సనత్‌నగర్, శివాలయం వీధిలో ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గూడూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు అమలుచేశారని వివరించారు. చేసిన మంచిని గుర్తుంచుకుని ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గూడూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మేరిగ మురళీధర్‌ను, ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, ఎంపీపీ గురవయ్య, కొండూరు సునీల్‌రెడ్డి, మగ్దూం, మాజీ కౌన్సిలర్ గిరిబాబు, వెంకటేశ్వర్లు, అజీజ్‌ఖాన్, మురళీ, అల్తాఫ్, దయాకర్, పూర్ణ, రమేష్, అశోక్, సుభాన్, జహీర్, వార్డు ఇన్‌చార్జులు విజయభాస్కర్, క్రిష్ణ, జేసీఎస్ కన్వీనర్లు రాఘవరెడ్డి, శ్రీహరి, మండ్ల రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సువిధ యాప్‌తో గంటలోనే అనుమతి



ఎన్నికల నియమావళిపై సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్

- ఆర్డీవో కిరణ్‌కుమార్
- ఎన్నికల నియమావళిపై సమీక్ష

గూడూరు రూరల్ : రాజకీయ నాయకుల సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, పార్టీ కార్యాలయాల ఏర్పాటు, వాహనాలకు సువిధ యాప్ ద్వారా గంటలోనే అనుమతి మంజూరు చేస్తామని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఎన్నికల నియమావళిపై గూడూరు నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టార్, మున్సిపాలిటీ, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల అమలులో ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలన్నారు. సభలు, సమావేశాలకు అనుమతి ఇచ్చేందుకు సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు యాప్‌లో నమోదు చేసుకున్న గంటలోపే అనుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేలు, పార్లమెంటుకు పోటీ చేసే వారు రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే వ్యయానికి సంబంధించి అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంటు అభ్యర్థి రూ.95 లక్షలకు మించరాదన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎలాంటి కార్యాలయాలు ఉండకూడదని, 10 వాహనాలకు మించి అనుమతి ఇవ్వరాదని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, ఓటు వేయాలని ఒక వర్గానికి నిబంధనలు విధించడం, ఒక వ్యక్తికే ఓటు వేయాలని చెప్పడం వంటివి నేరంగా పరిగణిస్తామని వెల్లడించారు. పడకలో ఉన్న, పూర్తిగా నడవలేని వృద్ధులు ఫారం–20 దరఖాస్తు చేసుకుంటే పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సెక్టార్ అధికారి, తహసీల్దార్, పోటీ చేసే అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం వద్దకు ఎలాంటి ఆయుధాలు తీసుకురాకూడదని తెలిపారు. ఎన్నికలలో అక్రమాలకు పాల్పడితే సీ విజిల్ యాప్ ద్వారా ఆర్‌వోకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ ఎఫ్ఆర్‌వోలు



దొరవారిసత్రం : మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్రంలోని దూలపల్లి ప్రాంతంలో శిక్షణలో ఉన్న 35 మంది ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్స్ సందర్శించారు. వీరు మహారాష్ట్రకు చెందిన వారు. వారు పక్షుల కేంద్రంలో బస చేస్తున్న విహంగాలను వీక్షించడంతో పాటు ప్రకృతిలో వాటి ప్రాధాన్యత, ఇక్కడికే రావడానికి గల కారణాలను స్థానిక ఫారెస్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పర్యావరణ కేంద్రంలో విహంగాల జీవన శైలి చిత్రాలను తిలకించారు. వీరి వెంట ఫ్యాకల్టీ డీఎఫ్‌వో వంశీకృష్ణ, సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్‌వో శామ్యూల్, పక్షుల కేంద్రం ఎఫ్ఆర్‌వో భాస్కర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌వో బాలయ్య ఉన్నారు.

మృత్యుంజయ స్వామికి శాస్త్రోక్తంగా పూజలు



విశేషాలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో మృత్యుంజయ స్వామిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహా మంగళహారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



సాయుధ దళాలతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం కేంద్ర సాయుధ దళాలతో కలిసి నాయుడుపేటలోని ఎస్ఎస్ఆర్ కాలనీ, విన్నమాలలో కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామని చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద పారా మిలటరీ దళాలు పర్యవేక్షిస్తుంటాయన్నారు. అలాగే ప్రజలు భయాన్ని వీడి నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ సహకరించాలని డీఎస్పీ కోరారు. సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

వైభవంగా పంగుణోత్తర ఉత్సవం

నారాయణవనం : స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పంగుణోత్తర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. కల్యాణ వెంకన్నకు, పద్మావతీ అమ్మవారికి సర్కారు అభిషేకం చేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై మాడవీధిలో ఊరేగించారు. అర్చకులు శాస్త్రోక్తంగా మూడుమార్లు మాలమార్పిడి క్రతువును పూర్తి చేశారు. అనంతరం ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.

లాభాల నిమ్మ సాగు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో రైతులు నిమ్మపంటను సాగుచేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన 15 మంది రైతులు 30 ఎకరాల్లో నిమ్మపంటను సాగుచేస్తున్నారు. తిరుపతి ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నిమ్మ మొక్కను రూ.25కు తీసుకొచ్చి నాటుతున్నారు. ఎకరాకు 130 మొక్కలు నాటి, ఐదేళ్ల పాటు కాపాడుకుంటారు. ఆ తర్వాత నిమ్మచెట్లు కాపుకొస్తాయి. అప్పటి నుంచి పదేళ్ల పాటు దిగుబడి వస్తుంది. నిమ్మనారు నాటినప్పటి నుంచి ఎకరాకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లకు రూ.75 వేలు ఖర్చువుతుంది. చెట్లు కాపుకి వచ్చిన తర్వాత ఎకరాకు ఏడాదికి రూ.20 వేలు ఖర్చవుతుంది. ఒక్కో చెట్టు సుమారు వెయ్యి నిమ్మకాయలపైగా కాస్తాయి. ఈ దిగుబడి 6 నెలలపాటు ఉంటుంది. వాణిజ్య పంట కావడంతో నిమ్మకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు నిమ్మకాయలను చెన్నై, నెల్లూరు, గూడూరు మార్కెట్‌లకు తీసుకెళ్లి అమ్ముతారు. నిమ్మకాయలకు మంచి ధర వస్తే ఎకరాకు అన్ని ఖర్చులు పోనూ రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు మిగులుతుందని రైతులు తెలిపారు. తమిళనాడు మదురై పట్టణంలో నిమ్మకాయలను ఔషధాల్లో వాడతారని రైతులు చెబుతున్నారు. ఆరుతడి పంట కావడంతో విద్యుత్ వినియోగం తగ్గుతుంది.

కోలాహలంగా హోలీ సంబరాలు

కోట : కోటలో సోమవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. కోటలో స్థిరపడిన రాజస్థాన్ వాసులు హోలీ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. వీధుల్లో రంగులు చల్లుకుంటూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి రాజస్థాన్ వాసులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని మార్వాడీలు, జైనులు సోమవారం హోలీ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు, యువకులు రంగులు చల్లుకుని ఆనందాన్ని పంచుకున్నారు. పట్టణంలోని దర్గావీధి, బజారువీధి, మూకాంబిక వీధి, రాజగోపాలపురం, ఎల్‌ఏ సాగరం, పిచ్చిరెడ్డి తోపు, రావువారివీధి, బేరిపేట, ఆకుతోట వీధి, పిల్లారిగుడి వీధితో పాటు పలు అపార్ట్‌మెంట్ల వద్ద హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మేనకూరు సెజ్‌లోని పలు పరిశ్రమల వద్ద కార్మికులతో పాటు యాజమాన్యం రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు.





కోటలో హోలీ సంబరాల్లో పాల్గొన్న వినోద్‌కుమార్‌రెడ్డి, నాయుడుపేట టౌన్ : రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలు జరుపుకుంటున్న మార్వాడీలు